సాక్షి తిరుపతి

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో శ్రీకాళహస్తికి చెందిన అన్నదమ్ములు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. - 8లో



నాయుడుపేటలో మూడిళ్లలో లూటీ

నాయుడుపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్ వీధిలో మూడు ఇళ్లలో దొంగలు లూటీ చేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	25
చిత్తూరు	36	25
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో జాన్వీకపూర్



ఆలయం వెలుపల జాన్వీకపూర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జాన్వీకపూర్ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బీఎస్ఎన్ఎల్‌లో డిజిటలైజేషన్ సేవలు

తిరుపతి అర్బన్: బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న డిజిటలైజేషన్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ అమరేంద్రరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వినియోగదారులు స్వీమ్‌ను పేపర్ అప్లికేషన్ ద్వారా పొందినట్లైతే కేవైసీ ద్వారా డిజిటలైజేషన్‌ను బీఎస్ఎన్ఎల్ కార్యాలయం లేదా ఫ్రాంచైజీ, రిటైలర్ వద్ద తమ ఆధార్‌కార్డుతో చేయించుకోవచ్చని తెలిపారు. మొబైల్ రంగంలో 4జీ సాంకేతికత రెండు నెలల్లో రానుందని, 3జీ సిమ్ ద్వారా సేవలు పొందుతున్న వారు 4జీ సాంకేతికతకు సెప్టెంబర్ 30వ తేదీలోపు ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. మీరు వాడుతున్న సిమ్ 3జీ లేదా 4 జీలో ఉందనే విషయం తెలుసుకోవడానికి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మెసేజ్ పంపితే తెలుసుకోవచ్చని స్పష్టం చేశారు.

తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై మార్గదర్శకాలు

తిరుపతి ఎడ్యుకేషన్: తరగతి గదుల్లో మొబైల్ ఫోన్ల వాడకంపై ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసినట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఈ మార్గదర్శకాలు అనుసరించి ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను తరగతి గదుల్లోకి తీసుకెళ్లరాదన్నారు. బోధనా సమయాల్లో స్వప్రయోజనాలకు వ్యక్తిగత మొబైల్‌ఫోన్ల వాడకాన్ని నిషేధించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులతో సహా ఉపాధ్యాయులు హాజరు వేసిన వెంటనే తమ మొబైల్ ఫోన్లను సైలెంట్ మోడ్‌లో ఉంచాలని, బోధనకు మొబైల్ ఫోన్ వాడాల్సి వస్తే ముందస్తుగా తమ లెసెన్ ప్లాన్లో మొబైల్ ఎందుకు ఉపయోగించాలనుకుంటున్నారో ప్రధానోపాధ్యాయుని వద్ద సంతకం చేయించుకున్న తర్వాతనే వాడాలని స్పష్టం చేశారు. అనివార్య కారణాలతో మొబైల్ ఫోన్ తీసుకోవాల్సి వచ్చినప్పుడు హెచ్‌టీ/ హెచ్ఎం వద్ద ముందస్తు అనుమతి తీసుకోవడంతో పాటు దానికి సంబంధించిన సరైన కారణాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. మొబైల్ వినియోగం అవసరమయ్యే అడ్మినిస్ట్రేటివ్ పనులు, ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు మార్కింగ్ యాప్, ఎండీఎం, ఇతర సూచించిన కార్యకలాపాలు, బోధన సమయం ప్రారంభానికి, ముగిసిన తరువాతనే చేయాలని తెలిపారు. ఇవి పాటించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



నగరిలో ముఖ్యమంత్రి సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు



చిరునవ్వులు చిందిస్తున్న సీఎం వైఎస్ జగన్

వరాలు కురిపిస్తూ.. దీవెనలందిస్తూ..

- జన సంద్రంగా మారిన నగరి
- ముఖ్యమంత్రి సభకు విశేష స్పందన
- చేనేత కార్మికులకు భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్
- సాగు, తాగునీటి ప్రాజెక్టుల వేగవంతానికి గ్రీన్‌సిగ్నల్

నేల ఈనిందా.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు నగరి జనసంద్రంగా మారిపోయింది. జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకంతో పట్టణం కిక్కిరిసింది. సంక్షేమ సారథిపై అభిమానం ఉప్పొంగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'దీవెన'లకు విద్యార్థుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది. చేనేత రంగంపై వరాల జల్లు కురిపించడంతో కార్మికుల్లో కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది. జయహో జగన్ నినాదం దశదిశలా మార్మోగింది.



ముద్దుల మనవడు!

సాక్షి, చిత్తూరు/నగరి : నగరిలో సోమవారం పండగ వాతావరణం కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల చదువుకు భరోసా కల్పించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజానీకం ఘనంగా స్వాగతం పలికింది. జగన్నన విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాది తొలి త్రైమాసికం నిధుల విడుదలకు నగరి పట్టణం వేదికగా మారడంపై స్థానికుల్లో ఆనందం నింపింది. ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

అభివృద్ధి దిశగా అడుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరి నియోజకవర్గ అభివృద్ధికి వరాలు కురిపించారు. చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు పవర్‌లూమ్స్ మీద ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయిస్తున్నట్టు ప్రకటించారు. గాలేరు నగరి సుజల స్రవంతిని అనుసంధానం చేసే వేణుగోపాల్‌సాగర్, వేపగుంట, అడవికొత్తూరు ప్రాజెక్టులకు సంబంధించి పనులు వేగవంతం చేసేందుకు హామీ ఇచ్చారు. ఇక రేణిగుంట ఎస్వీ షుగర్‌లో 226 రైతు కుటుంబాలకు చెల్లించాల్సి రూ.21.37 కోట్ల బకాయిలు చెల్లించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.



కంప్యూటర్ బటన్ నొక్కి విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆకట్టుకున్న మంత్రి రోజా ప్రసంగం

మంత్రి ఆర్‌కే రోజా ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రజనీకాంత్ నటించిన జైలర్ చిత్రంలోని 'కొలైక్కాద నాయుం ఇల్లై.. కొర సొల్లాద వాయుం ఇల్లై, ఇదు రెండుం ఇల్లాద ఊరుం ఇల్లై (మొరగని కుక్క లేదు.. విమర్శించని నోరూ లేదు.. ఈ రెండు లేని ఊరులేదు)' అంటూ చెప్పిన డైలాగ్‌కు ప్రజలు కరతాళ ధ్వనులు చేశారు. చివరగా అర్థమైందా రాజా అని ప్రతిపక్షాల ఉద్దేశించి చెప్పడం మరింత అలరించింది. జగనన్నను ఢీకొనేందుకు కలసికట్టుగా కుట్రలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై మంత్రి విసిరిన పంచ్‌లకు ప్రజలు ఈలలు వేస్తూ, కేరింతలు కొట్టారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ



తిరుమల శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఆగమోక్తంగా పవిత్రాలను సమర్పించారు. సంపంగి ప్రాకారంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లతో పాటు పరివార దేవతలకు పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు.

- తిరుమల

విద్యార్థులకు నాణ్యమైన సేవలు

- బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ సీతారామారావు



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ సీతారామారావు

తిరుపతి సిటీ: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన సేవలందించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ కే.సీతారామారావు అధికారులకు సూచించారు. సోమవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అంబేడ్కర్ వర్సిటీ రాయలసీమ కో–ఆర్డినేటర్ల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పేద, బడుగు బలహీన వర్గాలకు విద్యనందించే విద్యాలయం అంబేడ్కర్ విశ్వవిద్యాలయమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థికీ సానుకూల దృక్పథంతో సేవ సేయాలని చెప్పారు. అనంతరం టీటీడీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్యాప్రమాణాలు పెంచడానికి ప్రతి ఉద్యోగి కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. సమావేశంలో అంబేడ్కర్ వర్సిటీ అధికారులు ఎల్వీకే ప్రసాద్, విజయకృష్ణారెడ్డి, రాజేంద్రరెడ్డి, పద్మావతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మహాదేవమ్మ, రీజనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిప నారాయణమ్మ పాల్గొన్నారు.

35,312 మంది తల్లులు.. రూ.29.23కోట్లు!



- నా పేరు లిఖిత. నేను శ్రీవేంకటేశ్వర ద్వారకా కాలేజీలో బీబీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా నాన్న వ్యవసాయం చేసుకుంటూ నన్ను, మా తమ్ముడు, చెల్లెల్ని చదివిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం బాధనిపించింది. అదేసమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన పథకం నా చదువుకు ఆటంకం కాకుండా ఎంతో ఉపయోగపడుతోంది.



- నా పేరు తనూష. నేను ఎస్జీహెచ్ఆర్ కాలేజీలో బీసీఏ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. నా ఊరు గుంతకల్లు. నేను డిగ్రీ చదువుకోడానికి తిరుపతికి వచ్చి హాస్టల్లో ఉంటున్నాను. మాది చాలా నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు మేస్త్రి పనిచేస్తూ నన్ను నా చెల్లెలిని చదివిస్తున్నారు. నేను జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా లబ్ధి పొందడం వల్లే డిగ్రీ పూర్తి చేసుకోగలుగుతున్నాను. సీఎం జగన్ మామయ్యకి ధన్యవాదాలు.



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి

- అట్టహాసంగా జగనన్న విద్యాదీవెన కార్యక్రమం

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 35,312 మంది తల్లుల ఖాతాల్లో రూ.29.23 కోట్లు జమచేసినట్టు అధికారులు వెల్లడించారు. నగరి నుంచి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా.. అదే సమయంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బల్లి కళ్యాణ్‌చక్రవర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. విద్యార్థులు సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తూ..చప్పట్లు కొడుతూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. జేసీ మాట్లాడుతూ మూడవ త్రైమాసికం (ఏప్రిల్ 23–జూన్23) జగనన్న విద్యా దీవెన ఆర్థిక సాయాన్ని తల్లుల ఖాతాల్లో జమచేసినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగా విద్యార్థుల చదువు కోసం పెట్టే డబ్బు ఖర్చు కాదని, వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పారు. అనంతరం మెగా చెక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌పీ రీసైకిల్ కౌంటర్ ప్రారంభం



హెచ్‌పీ రీసైకిల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌పీసీఎల్ కంపెనీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొత్త ఆలోచనతో గివ్ వేస్ట్ గెట్ ఫ్యూయల్ నినాదంతో మహతి ఎదురుగానున్న హెచ్‌పీ హోంకో మిలినియం ప్రైడ్ ఆవరణలో హెచ్‌పీ రీసైకిల్ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించారు. హెచ్‌పీసీఎల్ కంపెనీ నెల్లూరు రీజనల్ జీఎం ఎన్.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పాత వస్తువులైన పేపర్, కార్డ్ బోర్డ్, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ పరికరాలను హెచ్‌పీ రీ సైకిల్ కౌంటర్‌లో డిపాజిట్ చేస్తే ఇందుకు సమానమైన విలువ గల కూపన్ జారీ చేసినట్టు తెలిపారు. ఈ క్యూపన్ ద్వారా వాహనాలకు డీజిల్, పెట్రోల్ పొందే అవకాశాన్ని కల్పించినట్టు వెల్లడించారు. సంబంధిత పాత వస్తువులను కౌంటర్‌లో ఇచ్చి క్యూపన్ పొంది సమానమైన డీజిల్, పెట్రోల్ పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. హెచ్‌పీసీఎల్ ఇంజినీరింగ్ హెడ్ రామప్రసాద్, సేల్స్ ఆఫీసర్ రెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీహరి అందించిన వివరాలు.. రేణిగుంటకు చెందిన భాస్కర్(31), విజయ్‌కుమార్(34)ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా ముందు వెళుతున్న బస్సును అధిగమించబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే.రోజా



ఎమ్మెల్సీలు కళ్యాణ్‌చక్రవర్తి, సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



ఎంపీ గురుమూర్తి,



ఎమ్మెల్యేలు ఆదిమూలం



కిలివేటి సంజీవయ్య



జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యేలు వరప్రసాద్‌రావు



బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

సీఎం జగన్‌కు స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట: చిత్తూరు జిల్లా నగరిలో జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం 9.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి సీఎం చేరుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర మంత్రులు బొత్సా సత్యనారాయణ, మేరుగ నాగార్జున వచ్చారు. సీఎంకు విమానాశ్రయంలో రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, బల్లి కల్యాణ్ చక్రవర్తి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తిరుపతి మేయర్ శిరీషా, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, ఆర్డీఓ రామారావు, తహసీల్దార్లు శివప్రసాద్, ఉదయ్‌సంతోష్ తదితరులు స్వాగతం పలికారు.

వీడ్కోలు

నగరి పర్యటన అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి పలువురు నేతలు వీడ్కోలు పలికారు.

అంతర్జాతీయ స్థాయికి స్విమ్స్



మాట్లాడుతున్న టీటీడీ జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: స్విమ్స్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు వైద్యులు కృషి చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్‌వీ కుమార్ పరిచయ కార్యక్రమం సోమవారం స్విమ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సదా భార్గవి మాట్లాడుతూ స్విమ్స్ అభివృద్ధికి ఆధునిక వైద్యానికి అవసరమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్, వైద్య పరికరాలను సమకూచేందుకు టీటీడీ సిద్ధంగా ఉందన్నారు. వైద్యుల ప్రమోషన్లను సైతం తాము వేగంగా పరిష్కరించామని గుర్తుచేశారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవకాశం భగవంతుని ఆశీస్సులుగా భావిస్తున్నానన్నారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు 30న ఇంటర్వ్యూలు

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి పై కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం ఇచ్చిందని, ఇప్పటికే అలైడ్ హెల్త్ సైన్స్, పారా మెడికల్ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రిన్సిపల్ చాంబర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అడ్మిషన్లు పొందే అర్హులు మొత్తం మొదటి ఏడాది ఫీజు రూ.8,150 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్: రీసర్వే పనులు వేగవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలతో రీసర్వేతో పాటు విలేజ్ సర్వే డేటా ఎంట్రీ, మ్యూటేషన్, అసైన్డ్ భూముల వివరాలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. భూ సర్వేకు సంబంధించి రెండో విడతలో 234 గ్రామాలకుగాను 210 గ్రామాల్లో పూర్తి చేశారన్నారు. జిల్లా సర్వే అధికారి జయరాజ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు



అధికారులతో సమీక్షిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా అమలు చేయాలని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌తో కలిసి క్లీన్ తిరుపతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా తిరుపతిలో పారిశుద్ధ్యం ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు మించి మెరుగైన పారిశుద్ధ్యాన్ని అమలు చేసేందుకు నిరంతరం పని చేయాలని సూచించారు. ఎక్కువ రోజులు విధుల్లోకి రాని సిబ్బందిని గుర్తించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని, శాశ్వత పారిశుద్ధ్య ఉద్యోగులు దాదాపు విధులకు హాజరు కావడం లేదన్న ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరించాలని కమిషనర్ హరితకు సూచించారు. అవసరమైన మేరకు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. పది రోజుల్లో పారిశుద్ధ్య అమలులో సమూల మార్పులు కనిపించాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌కు సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు యధావిధిగా వాడకంలోకి వచ్చాయని, కాలువలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,152 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 30,329 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీలు

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 99 వినతులు వచ్చినట్టు తెలిపారు. ఇందులో రెవెన్యూశాఖకు సంబంధించి 70 అర్జీలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్పందనకు 55 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా హాజరై సమస్యలు విన్నవించుకున్నారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో వచ్చినట్టు ఏఎస్పీలు తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో అన్నదమ్ముల ప్రతిభ

శ్రీకాళహస్తి: గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచారు. ఈ పోటీలలో అండర్–14, అండర్–16 విభాగంలో అన్నదమ్ములు విజేతలుగా నిలిచారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ అండర్–12, అండర్–14, అండర్ –16 బాలబాలికల విభాగంలో పోటీలు జరిగాయి. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన అన్నదమ్ములు కరణ్‌కుమార్, జయసాయికుమార్‌తో పాటు సీహెచ్ చైతన్యశ్రీ పాల్గొన్నారు. అండర్–16 విభాగంలో కరణ్‌కుమార్ విజేతగా నిలవగా, అండర్ 14 విభాగంలో జయసాయికుమార్, చైతన్యశ్రీ విజేతలుగా నిలిచారు. ఈ ముగ్గురు క్రీడాకారులు శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని క్లాసిక్ టెన్నిస్ అకాడమీ కోచ్ మునికృష్ణారెడ్డి వద్ద శిక్షణ తీసుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

మూలే విజయలక్ష్మికి గిడుగు పురస్కారం



డాక్టర్ మూలే విజయలక్ష్మి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు మూలే విజయలక్ష్మి గిడుగు వెంకట రామమూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి విజయబాబు ఉత్తర్వులు జారీచేశారు. తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విజయవాడలోని తుమ్మల పల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆమె గిడుగు పురష్కారాన్ని అందుకోనున్నారు. ఆమె అధ్యాపకురాలిగా 30 ఏళ్ల పాటు పనిచేసి 2019లో ఉద్యోగ విరమణ పొందారు. ఆమె తెలుగు జాతీయాలు, ప్రధాన ద్రావిడ భాషల్లో జాతీయాలు, తులనాత్మక పరిశీలన, మాండలికాలపై విశేష కృషి చేశారు. భాషా సాహిత్యాలపై సుమారు 14 గ్రంథాలు, 108 పరిశోధనా వ్యాసాలు రచించారు. ప్రధానంగా సిరిమల్లెలు, చిత్తూరు, వైఎస్ఆర్ జిల్లాల తెలుగు మాండలిక పదకోశం, రెడ్డి సామాజిక వర్గంపై చేసిన రచనలు పాఠకుల మన్ననలు పొందాయి.

31న సర్వసభ్య సమావేశం

నగరి : జిల్లాలోని పీఈటీలు, పీడఅఈలు, ఏపీఆర్ఎస్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, కేజీబీవీఎస్‌లకు ఈ నెల 31వ తేదీన జనరల్ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ చౌడేపల్లెఓని విజయవాణి రెసిడెన్షియల్ పాఠశాలలో ఉదయం 8 గంటలకు పీడీ రామచంద్ర అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి



ఆలయ ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు, తిరుపతి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు పాల్గొన్నారు.

నాయుడుపేటలో మూడిళ్లలో లూటీ

- 47 సవర్లకు పైగా బంగారు నగల అపహరణ
- 3 కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షల నగదు కూడా..



నాయుడుపేటలో దొంగలు లూటీ చేసిన ఇళ్లు ఇవే



బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బాలాజీ గార్డెన్ వీధిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ ఇళ్లల్లో దొంగలు లూటీ చేశారు. సుమారు 45 సవర్లకు పైగా బంగారు నగలు, మూడు కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షల నగదు అపహరించుకుని వెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం.. పట్టణంలోని బాలాజీ గార్డెన్ వీధిలో ఉపాధ్యాయుడు లొక్కు శ్రీనివాసులు కొత్తగా రెండో అంతస్తు ఇంటి నిర్మాణం పూర్తిచేసి రెండు రోజుల క్రితం గృహప్రవేశం చేశాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా కింది ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో నిద్రలేచి కిందకు వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన 30 సవర్లకు పైగా బంగారు నగలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.76 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించాడు. అతని ఇంటి సమీపంలో ఉన్న అన్నమేడు హెచ్‌ఎం మధుసూదన్‌రావు భార్యతో కలిసి హైదారాబాద్‌కు వెళ్లారు. ఆ ఇంట్లోకి చొరబడి 17 సవర్ల బంగారు నగలు, కిలో వెండి వస్తువులు దోచుకెళ్లినట్టు గుర్తించారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కండలేరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పాలూరు చంద్రయ్య భార్యతో కలిసి నెల్లూరులో చదువుకుంటున్న కుమార్తె వద్దకు ఆదివారం వెళ్లి అక్కడే బంధువుల ఇంట్లో ఉన్నారు. ఇదే అదునుగా దొంగలు 6 గ్రాములు బంగారు నగలు, కేజీ వెండి వస్తువులు, రూ.10 వేల నగదు చోరీచేసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ నరసింహారావు సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఇంటి గోడలపై ఉన్న కాలి ముద్రలను గుర్తించారు. తిరుపతి జిల్లా నుంచి వచ్చిన క్లూస్‌టీం, ఫింగర్ ప్రింట్ ఎస్ఐ దస్తగిరి తన సిబ్బందితో కలిసి ఆనావాళ్లను గుర్తించారు. ఒకే వీధిలో తాళలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేయడం స్థానికంగా కలకలం రేపింది.



చోరీ జరిగిన ఇంట్లో సీఐ నరసింహులు, క్లూస్ టీం ఎస్ఐ దస్తగిరి పరిశీలనలు

దొంగలను పట్టుకుంటాం



పట్టణంలో మూడిళ్లలో చోరిలకు పాల్పడిన దొంగలను త్వరగా పట్టుకుంటామని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. చోరీ జరిగిన మూడు ఇళ్లను ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నాయుడుపేట డివిజన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువ రోజులు ఇళ్లు వదిలి వెళ్లే క్రమంలో ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద పోలీస్ పహరాతో పాటు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.